స్కెచ్

# ము స ల మ్మ మొ ర

పి. దుర్గానాగేశ్వరరావు

'ట్రైం అయిపోయింది. తొందరగా పరిగెత్తుకొచ్చాను బుకింగ్ ఆఫీసు దగ్గరకు. రైల్వే గడియారం చూశాను: ఇంకా పది నిమిషాల ట్రైం ఉంది; అమ్మయ్య! చేతిలో సంచీయే కాబట్టి సరిపోయింది; బతికాను!

కిటికీ దగ్గర జనం కిక్కిరిసి ఉన్నారు; రణగొణ ధ్వని.

పర్సు తీశాను.

ఎవరో ముసిల్ది, దాదాపు ఏడుస్తూ వచ్చింది: 'బాబూ! ఎన్నడూ అడిగే దాన్ని కాదు నాయనా! ఆ కనిస్టీబు చేశాడింతా. పదణా లిప్పించు బాబూ! టిక్కెట్టు కొనుక్కుంటా.'

తొందర్లో ఎవరి కాలో తొక్కాను. నావంక ఉరిమి చూసిన మొహానికి ఒక 'సారీ' సరిపోయింది.

వెనకనుంచి ముసల్ది: 'కూతురికి ప్రాణంమీది కొచ్చింది తండ్రీ! టిక్కెట్టు తెస్తానని ఆ కనిస్టీబు కాజేశాడు నాయనా డబ్బులు.'

తల తిప్పాను అటువైపు:

ఏడుస్తూ ముసిల్ది, ఆత్రుతగా అడిగింది: 'నాయనా! పిల్లదానికి చాలా జబ్బు చేస్తే చూడ్డానికి పోతున్నాను. తెచ్చుకోలేక గాని పెట్టమని ఆ పోలీసు కనిస్టీబు కిచ్చాను— '

'ఎవరికిచ్చావు— ? వాడి నంబరెంత ?'— పక్కన ఎవరో అడిగారు.

'నంబరా! అదేమో నాకు తెలియదు నాయనా. నే తెస్తా నిమ్మన్నాడు. నమ్మి యిచ్చా నాయనా,మాయ చేస్తా డనుకోలేను.'

'ఎవరి కిచ్చావో— ?' అని మరొకడు అన్నాడు.

'ఆ ఎర్రటోపీకి నాయనా!'

అడిగినాయన దర్జాగా వెళ్లిపోయాడు.

జనాన్ని నెట్టుకుపోయి టిక్కెట్టు తెచ్చుకుందామని ప్రయత్నించాను. ఎవరో ఇద్దరి మీంచి ఎగిరి, కిటికీఊచ పట్టుకుని టిక్కెట్టు అడుగుతున్నాడు. ఓ నిమిషం ఆగుదామని పించింది.

'నాయనా !' దీనంగా, ముసిల్ది.

మహా ఆర్చేవాడిలా- తీర్చేవాడిలా అడిగాడు ఒకడు : 'ఎప్పుడిచ్చావు ?'

'ఇందాకనే బాబు ! ఇక్కడున్నట్టే మాయమైనాడు, దొంగచచ్చినాడు.'

అటూ యిటూ చూశాను. ఎవడూ పోలీసు లేడు.

'అరణాలు ఎవరో పుణ్యాత్ము లిచ్చారు నాయనా. దయతలిచి-' చెయ్యి చాపింది, ముసిల్ది.

ఒక తలపాగామనిషి పోతూ 'పాపం!సాయం చెయ్యండి బాబూ !' అని సిఫార్సు చేసి పోయాడు. ఏదన్నా యిద్దా మనిపించింది. చేతిలో నోటు !

'మీ ఊరికి టిక్కెట్టెంత ముసలమ్మా !' అని ఒక కుర్రాడు అడిగాడు.

'రూపాయిబేడా, నాయనా.'

కుర్రాడు వెళ్ళిపోయాడు. ఈ కేసు చాలా 'హోప్‌లెస్' కింద కట్టేశాను; పన్నెండణాలు ఎవ డిచ్చుకోగలడు ?

జనంలోకి తెగించి చొరబడ్డాను, చూస్తూ నుంచుంటే పనికాదని. చొక్కా చింపుకుని, కాలు ఎవడో తొక్కితే నెత్తురు రాగా, చెమట పట్టి బయటి కొచ్చాను.

ఒక్కసారి ఊపిరి పీల్చుకుని ప్లాట్‌ఫారం మీదికి పోదా మనుకుంటున్నాను.

ముసిల్ది ఎదురు- 'బాబూ ! నీకు తోచింది—'

ఒళ్లు మండింది; కాలు తుడుచుకుంటున్నాను. 'పోపో' అన్నాను. చాలా కర్కశంగా అన్నానని యిప్పుడు తెలుస్తోంది. ముసిల్ది ఏం మాట్లాడలేదట్లే ఉంది.

ఎవర్నో అడుగుతోంది. ఎవరో 'ఇదో వేషం' అంటున్నారు.

నడిచిపోయాను. స్నేహితుడు నేను కనిపించాడు: ఆపి, 'అంత తొందరేమిటోయ్ !' అన్నాడు.

'రైలు వదలేదూ! ఎక్కడికి పోతున్నావు?' అని అడిగాను.

'ఇంకా ఈబోటు యిప్పుడప్పుడే బయల్దేరదు. ఎదురుబండి యిక్కడే క్రాసింగ్... అందులో దిగుతానులే, మా ఆఫీసరు—'

పాడుబండి. ఎప్పుడూ లేట్. విసుగేసుకొచ్చింది.

'అటు పోదాం రా. కాస్త సోడాయేనా తాగుదాం.'

పోయి ఐస్ సోడా తాగాం. పావలా సమర్పించుకున్నా.

'రెండు సిగరెట్లు తీసుకో' మని నేను-అణన్నర పెట్టి రెండు చిల్లరముక్కలు వాడికిచ్చాను.

'ఇక పోయొస్తా' నంటున్నాడు వాడు.

పోలీసు వాడొకడు మేంకొన్న పాన్-బీడా-సిగరెట్-అగ్గిపెట్టె-వాణ్ణి గదమాయిస్తున్నాడు: 'ఏరా రాస్కెల్! మళ్ళీ—'

వాడు పారిపోయాడు- 'బాబూ, బాబూ' అంటూ.

నేను కిళ్ళీలు తీసుకున్నాను; వాడికి డబ్బులు యివ్వడం తప్పింది!

'చోటుండదు. ఇక పోరా' అన్నాడు వాడు.

ఏదో కంపార్టుమెంటులో ఎక్కాను.

నాకోసం వచ్చి వీడ్కోలిచ్చినట్టు వాడు చెయ్యి ఊపాడు. మళ్ళీ చెయ్యి ఊపాను తలెత్తి.

ప్లాట్‌ఫారం కటకటాల అవతల ముసిలిది ఏడుస్తూ నుంచుంది-కనిపించింది.

మనస్సు చివుక్కుమంది.

మొదటి గంట మోగింది.

'నా ట్రెయిన్ వచ్చింది పోతున్నా' నని నేను అన్నట్టున్నాను. వెనకనుంచి—

'ఆడంగులు ఎక్కుతుంటే తప్పుకో వేం!' అని ఎవరో అన్నారు.

పక్కకి చూశాను; ఎవరో అమ్మాయి సర్కస్ చేసినట్టుగా ఎక్కింది కంపార్టుమెంటులోకి, నన్ను రాసుకుంటూ పోయి.

'అరే-' అని పిలిచాను. వాను వినిపించుకోలేదు.

ముసలమ్మవంక చూస్తూనే ఉన్నాను. అంతగా ఎన్నడూ బాధ అనిపించలేదు. గుండె కొట్టుకుంది. కనీసం పావలాఅయినా యివ్వలేక పోయాను.

దిగి తీసుకొద్దా మనిపించింది.

రెండోగంట కొట్టారు.

ముసిల్ది ఏడుస్తోంది, చేతులుసాచి.

ఒక్క పరుగున పోయి పిల్చుకొస్తే-గార్డుతో చెబితే—

గార్డు విజిల్.

నేరస్థుడిలాగ కంపార్ట్‌మెంటు గేటుదగ్గర నిలబడ్డాను.

ట్రెయిను కదిలింది కాబోలు- సాగిపోతున్నాను. చల్లగాలి వచ్చి కొట్టింది. దీప స్తంభం పోయి, టెలిగ్రాఫ్ స్తంభం అడ్డొచ్చింది-

లోపల ఎవరో ఘర్షణపడుతున్నారు. ఎవరో పిల్ల ఏడుస్తోంది. వెనక్కి తిరిగాను.

పోలీసు, బెంచీలకింద తొంగిచూస్తున్నాడు: చాలా బియ్యంమూటలు బయటపడ్డాయి.

నాకు చోటు దొరకడం చాలా అదృష్టం; ఎవరో దయతల్చి ఉంటాడు. కూచున్నా.

పోలీసువాడు బెదిరిస్తున్నాడు. మూటలు తెచ్చినవాళ్ళు 'బాబు, బాబు' అంటున్నారు. 'కనిస్టీబుబాబు!' అని ఎవతో వెకిలిగా నవ్వుతోంది, మూట తెచ్చినది.

పోలీసు కనిస్టీబు బుద్ధావతారమెత్తి, అప్పుడప్పుడు ధనపథం పారాయణ చేస్తున్నాడు. బియ్యంమూటలు తెచ్చిన ఆడవాళ్ళు, మగవాళ్లు, పిల్లలూ — దోచెడుమంది, గొంటెలో దోపిన జాలరుసంచుల్లోంచి, రవికచాటుల్నుంచి, చెంగు మూటల్లోంచి చెల్లించుకుంటున్నారు ముడుపులు.

నాపక్క ఆసామి మూడుమూటలు తన వెనక దాచి, బీదవాడికి సాయం చేస్తున్నాడు.

'ఆ గింజలకోసం బతుకుతున్నాం బాబూ' అని మూటలు తెచ్చినవాడు ఎవడో అంటున్నాడు.

'ఇది ఎన్నోసారే—' అని కనిస్టీబు ఎవరో బెదిరిస్తున్నాడు. 'ఈపాలికి పోనియ్యి కనిస్టీబు బాబూ' అని మరొకతె సిఫార్సు.

ఎవర్నీ ఏం అనగలిగిన స్థితిలో లేను. అని చెయ్యగలిగినదీ లేదు, చేసి చెప్పగలిగినదీ లేదు.

ముసిల్ది తలపులోకి వస్తోంది—